

- జిల్లాలో యథేచ్ఛగా అక్రమ రవాణా
- వాగుల నుంచి తరలించి అనువైన చోట నిల్వ
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం

ఇసుక దోపిడీ



ఆసిఫాబాద్ పెద్దవాగులో ట్రాక్టర్లలో నింపుతున్న ఇసుక(ఫైల్)

ఆసిఫాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. నిబంధనలకు పాతరేసి అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఫలితంగా వాగులు, వంకలన్నీ వట్టిపోయి భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. జిల్లాలో ఎలాంటి ఇసుక రీచ్‌లు లేక పోయినా ట్రాక్టర్ల యజమానులు నామ మాత్రంగా పర్మిట్లు తీసుకుంటున్నారు. ఒక్కో పర్మిట్‌పై పదేసి ట్రిప్పుల చొప్పున ఇసుకను తరలిస్తున్నారు.ముఖ్యంగా ట్రాక్టర్ యజమానుల నుంచి అధికారులు డబ్బులు వసూలు చేస్తూ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా జిల్లా కేంద్రంతో సహా 15 మండలాల్లోనూ ఇంచుమించు ఇదే తరహాలో మాఫియా దర్జాగా ఇసుక దోపిడీకి పాల్పడుతోంది. నిర్మాణ రంగం ఊపందుకుంటున్న పరిస్థితుల్లో ఇసుకకు డిమాండ్ ఏర్పడడంతో వ్యవసాయ అవసరాల కోసం వినియోగించాల్సిన ట్రాక్టర్లు ఇసుక దందాలోనే తిరుగుతుండడం పరిస్థితి తీవ్రతకు దర్పణం పడుతోందని చెప్పవచ్చు.

● అక్రమార్కులకు నాయకుల అండ..

జిల్లాలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారికి ఆయా పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధుల అండదండలు ఈ అక్రమ వ్యాపారం వెనక పుష్కలంగా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆసిఫాబాద్ పట్టణ శివారులోని పెద్దవాగు మొదలుకుని దహెగాం మండలంలోని ఎర్రవాగు వరకు నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్న ఇసుక చోరులు మాఫీయాను తలదన్నే రీతిలో ఏకంగా ఎక్స్‌కవేటర్లు, డోజర్లు వంటి యంత్ర సామగ్రిని ఉపయోగించి మరీ ఇసుక వ్యాపారానికి తెర లేపడం అధికారుల పని తీరును ప్రశ్నార్థకంగా మార్చి వేసింది. వాస్తవానికి కుమరం భీం జిల్లాలో అధికారికంగా ఎలాంటి ఇసుక రీచ్‌లు గుర్తించలేదు. కానీ జిల్లాలో ఉన్న వాగుల నుంచి అక్రమార్కులు ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మార్కెట్‌లో ప్రస్తుతం టన్ను ఇసుకకు రూ.2,000 నుంచి రూ.2,500 వరకు ధర పలుకుతోంది. నిబంధనల ప్రకారం లారీలలో ఇసుక తరలించరాదన్న ఆదేశాలు ఉన్నాయి. అక్రమ ఇసుక తవ్వకం దారులు వ్యూహాత్మకంగా రూట్ మార్చి ట్రాక్టర్ల ద్వారా రహస్య ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకున్న డంప్‌లకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి లారీల్లో ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నట్లు చెబుతున్నారు. ఇలా జిల్లాలో రెబ్బెన మండలంలోని గంగాపూర్, పులికుంట, కొండపల్లి వాగులతో పాటు దహెగాం మండలంలోని కల్వాడ ఎర్రవాగు, పెద్దవాగు, కౌటాల మండలంలోని ముత్తంపేట, తాట్‌పల్లి వాగులు, చింతలమానెపల్లి మండలంలోని రుద్రాపూర్, చింతలమానెపల్లి, కాగజ్‌నగర్ మండలంలోని రాస్పెల్లి, పెద్దవాగు, కెరమెరి మండలంలోని సాంగ్వీ, కైరి వాగు, సిర్పూర్(టి) మండలంలోని పెద్దబండ వాగుల నుంచి ఇసుక మాఫీ పెద్ద ఎత్తున ఇసుకను వెలికి తీస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. అదికారులకు తెలిసినప్పటికీ ఇసుక సిండికేట్లు ముట్ట చెప్పే మామూళ్లకు ఆశపడి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారుల పని తీరుపై ఆరోపణలు ఎక్కువ అయిన సమయాల్లో ఒకటి రెండు కేసులు నమోదు చేస్తున్నారని చెబుతున్నారు.

● వేసవిలో నీటి కొరత..

వర్షాకాలంలో పుష్కళంగా కనిపించే భూగర్భ జ లాలు ఎండ కాలంలో పాతాళానికి చేరుతున్నాయి. ఏటా మనుషులకే కాకుండా పశు పక్షాదులు, జం తువులకు తాగునీటి సమస్యలు ఉత్పన్నం కావడం ఇక్కడ సర్వ సాధారణం. వాగుల్లో అడ్డగోలుగా సాగుతున్న ఇసుక తవ్వకాల మూలంగా ఉన్న కొద్ది పాటి భూగర్భ జలాల మట్టం కూడా దారుణంగా పడి పోతున్నట్లు భూగర్భ జల వనరుల శాఖ సేకరించిన సర్వేల్లో వెల్లడైంది. ముఖ్యంగా వాగు లు, ఒర్రెలు ప్రవహిస్తున్న పరిసరాల్లో భూగర్భ జలాలపై ఇసుక తవ్వకాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దాంతో ఆయా ప్రాంతాల్లోని గిరిజన గ్రామాలు, గూడాల్లో తీవ్ర తాగునీటి సంక్షోభం తలెత్తుతున్నట్లు గుర్తించారు. నిబంధనల ప్రకారం నదులు, ఉప నదుల్లోనే మీటర్ లోతుకు మించి ఇసుక తవ్వకాలు జరపడం నిషేధం. వాల్టా చట్టా న్ని అనుసరించి వాగులు, వంకల్లో అసలు ఇసుకే తీయకూడదు. కానీ జిల్లాలో అడుగడుగున నిబంధనలు తుంగలో తొక్కుతూ అక్రమంగా ఇసుక దందా సాగుతుండడంతో భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు చెబుతున్నారు. ము ఖ్యంగా అటవీ ప్రాంతాల్లో ఇసుక తవ్వకాల వల్ల వన్య ప్రాణులకు తాగునీటి లభించని పరిస్థితి తలెత్తుతున్నదని చెబుతున్నారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలి..



- బోగే ఉపేందర్,
సీపీఐ జిల్లా నాయకుడు

జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అధికారులు అడ్డుకోవాలి. జిల్లా వ్యాప్తంగా అక్రమార్కులు ఇసుక ను యథేచ్ఛగా తరలించుకుపోతున్నా మైనింగ్, రెవెన్యూ పోలీసుశాఖల అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. జిల్లాలో నిబంధనలు తుంగలో తొక్కుతూ అక్రమంగా ఇసుక దందా సాగుతుండడంతో భూగర్భ జలాలపై తీవ్ర ప్రభా వం పడుతోంది. ఇసుక అక్రమ రవాణాకు పాల్ప డుతున్న వారిపై వాల్టా చట్టం కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

వాంకిడి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌బీఐ రీజనల్ మేనేజర్ రితేష్ గుప్తా సూచించారు. మండలంలోని జైత్‌పూర్ గ్రామంలో మంగళవారం ఆర్థిక అక్షరాస్యతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు, చిన్న వ్యాపారులు, పేద వర్గాల ప్రజలకు నేరుగా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందాలన్న ఉద్దేశంతో కేంద్రం ప్రభుత్వం 2014లో ప్రారంభించిన జన్‌ధన్ యోజన పథకం ద్వారా కోట్ల మంది ప్రజలు బ్యాంకులో ఖాతాలు తెరిచి ఆర్థికంగా అభివృద్ధి చెందారని అన్నారు. బ్యాంకింగ్ నిబంధన ప్రకారం పదేళ్లకు ఒకసారి కేవైసీ పునరుద్ధరణ చేయించడం తప్పనిసరిఅన్నారు. జన్‌ధన్ యోజన పథకం పదేళ్ల పూర్తి చేసుకున్నందున జన్‌ధన్ యోజన ఖాతాలకు కేవైసీ పునరుద్ధరణ తప్పనిసరి చేసుకోవాలన్నారు. కేవైసీ కోసం ప్రజలు సమీపంలోని ఖాతాదారుల సేవా కేంద్రం(కస్టమర్ సర్వీస్ సెంటర్) లేదా బ్యాంకులో సంప్రదించి వ్యక్తిగత గుర్తింపు, చిరునామా వంటి వివరాలతో పాటు ఆధార్‌కార్డు సమర్పించి తమ ఖాతా కేవైసీ అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. జూలై 1 నుంచి సెప్టెంబరు వరకు జన్‌ధన్ యోజన కేవైసీ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీజీఎం జగదీష్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజేశ్వర్ జోషి, టీజీబీ బ్యాంకు మేనేజర్ కృష్ణా, ఎస్‌బిఐ మేనేజర్ నందకిషోర్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

వాంకిడి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని వెలిగి గిరిజన ఆశ్రమ పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరుశాతం, స్టాక్ రిజిస్టర్, మౌలిక వసతులను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని చెప్పారు. పాఠశాలలో పరిశుభ్రత లోపించకుండా చూడాలన్నారు. వంటశాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, వంటసామాగ్రిని శుభ్రంగా కడిగి వంట కాలు చేయాలని సూచించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ఎంపీడీవో భోజనం చేశారు. ఎంపీడీవో వెంట ప్రధానోపాధ్యాయుడు దామోదర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి



ఇందిరమ్మ ఇంటి పనులను పరిశీలిస్తున్న అధికారులు

సిర్పూర్ (టి), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పనులు లబ్ధిదారులు వేగవంతం చేయాలని సిర్పూర్(టి) ఎంపీడీవో సత్యనారాయణ, హౌసింగ్ ఏఈ సజీవోద్దీన్ అన్నారు. మండలంలోని చీలపెల్లి, రావణ్‌పెల్లి, లింబుగూడ తదితర గ్రామాల్లో చేపడుతున్న ఇళ్ల పనులను వారు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ బేస్‌మెట్ లెవల్ వరకు నిర్మించుకున్న లబ్ధిదారులకు వారి ఖాతా ల్లో డబ్బులు జమచేయడం జరుగుతుందన్నారు. అనంతరం చీలపెల్లిలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలను ఎంపీడీవో తనిఖీ చేశారు. విద్యార్థులకు మధ్యాహ్నం భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. వర్షాకా లంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ సెక్రటరీ తదితరులు ఉన్నారు.

కనీస వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

కాగజ్‌నగర్ టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తలకు పారితోషికాలు కాకుండా కనీస వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం నిర్వహించిన ఆశా వర్కర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో, మురికి వాడల్లో పని చేస్తున్న ఆశా కార్యకర్తల కుటుంబాలు వేతనాలు సరిపోక ఎన్నో ఇబ్బందులు పడుతున్నాయన్నారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రూ. 18 వేల వేతనం అమలు చేయాలని కోరారు. పదోన్నతులు, టీఏ, పీఎఫ్, ఈఎస్‌ఐ, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు రజిని, రమా, లక్ష్మి, స్వర్ణలత, షబానా తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్ టౌన్, ఆగస్టు 5: చింతల మానెపల్లికి చెందిన శనిగరపు కమల అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతుండగా సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ. 2 లక్షల ఎల్‌వోసీ (లైన్ ఆఫ్ క్రెడిట్)ని మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే హరీశ్‌బాబు అందజేశారు. సద్వినియోగం చేసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సూచించారు.

అట్రాసిటీ బాధితులకు భరోసా



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అట్రాసిటీ బాదితులకు తక్షణమే నష్ట పరిహారం అందించి భరోసా కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రతి నెలా 30వ తేదీన ప్రతి మండలంలోని ఒక గ్రామంలో పౌరహక్కుల దినోత్సవాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు. అట్రాసిటీ చట్టాలపై అవగహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం ఎస్పీ కాంతిలాల్ పాటిల్ మాట్లాడుతూ ఈ ఏడాది ఇప్పటివరకు 21 కేసులు నమోదయ్యాయని తెలిపారు. బాధితులకు నష్ట పరిహారం అందించి కేసులు నమోదైన వారికి శిక్ష పడేలా చర్యలు తీసుకుం టున్నామని చెప్పారు. అట్రాసిటీ కమిటీ సభ్యులు మాట్లాడుతూ కేసులు నమోదైన వారికి స్టేషన్ బెయిల్ ఇవ్వకూడదని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమావే శంలో సబ్‌కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఏఎస్పీ చిత్తరంజన్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్, అట్రాసిటీ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మండలంలోని చిర్రకుంట గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, వంటశాల, రిజిస్టర్‌లను పరిశీలించారు. విద్యార్థలకు కట్టెల పొయ్యిపై మధ్యాహ్న భోజనం వండడాన్ని గమనించారు. గ్యాస్ పైన వంట చేయాలని నిర్వహకులకు సూచించారు. ఏజో తరగతి గదిని సందర్శించి విద్యార్థులను గణితం సబ్జెక్టులో పలు ప్రశ్నలు అడగడంతో పాటు బోర్డు పై జవాబులు చేయించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి ఉదయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ ఓటిం గ్ యంత్రాలు భద్రపరి చిన గోదాం వద్ద నిరం తరం పటిష్టమైన రక్షణ చర్యలు అమలు చేస్తున్నామని కలెక్టర్ వెంక టేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాం వద్ద రక్షణ చర్యలను మంగళవారం పరిశీలించారు. ఓటింగ్ యంత్రాల గోదాము వద్ద పోలిస్ బందోబస్తు ఏర్పాటు చేసి నిత్యం పహరా కాచేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. గోదాము చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి గట్టి నిఘా ఏర్పాటు చేశామని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు శ్యాంలాల్, ముసావీర్ హుస్సేన్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ఖాళీలు భర్తీ చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు

జైనూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జైనూరు సీహెచ్‌సీ, పీహె చ్‌సీలో గిరిజన ప్రాంత రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు సిబ్బంది పోస్టులు భర్తీ చేయాలని జైనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు మంగళవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా జైనూరు, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల రోగులు వందల సంఖ్యలో జైనూరు సీహెచ్‌సీ, పీహెచ్‌సీలో వైద్యం కోసం వస్తున్నారని అన్నారు. సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఉట్నూరు, ఆదిలాబాద్ రిమ్స్‌కి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. సీహెచ్‌సీలో ఎక్స్‌రే మిషన్, స్కానింగ్ మిషన్లు ఉన్నప్పటికీ సంబంధిత టెక్నీషియన్లు, గైనకాల జిస్ట్ లేనందున గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఫార్మాసిస్ట్, స్టాఫ్‌నర్సుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఎనిమిది మంది డాక్టర్లు కావా ల్సి ఉండగా కేవలం ఇద్దరు మాత్రం ఉండడంతో అరకొర వైద్య సేవలు అందుతున్నాయని వారు వివరించారు. రోగులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



బాధ్యతలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని జిల్లా విద్యాశాఖ అధికారిగా అదనపు బాధ్యతలు తీసుకున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం పూర్తి అదనపు బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో విద్యా వ్యవస్థను పటిష్ట పరిచేందుకు, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెను ప్రకారం పోషక విలువలు కల్గిన ఆహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటా మన్నారు. పదో తరగతి వార్షిక పరీక్షలకు విద్యార్థులపై ఇప్పటినుంచే ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా విద్యాశాఖ అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

జైనూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేనయాలని మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవ్‌రావ్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం స్థానిక మార్కెట్ యార్డులో కుల పెద్దలతో కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతు జైనూరు ఏజెన్సీ కేంద్ర బిందువుగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం వేడుకలు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలన్నారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలి వచ్చి తమ తమ అభిప్రాయాలను తెలియపర్చాలని కోరారు. ఆదివాసీ గూడాల్లో ఆదివాసీ జెండాలు ఎగుర వేసి సంబరాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు మధురాజ్, నాయకులు మడావి మనోహర్, కుంర దుందేరావ్, కుంరం శ్యాంరావ్, మేస్రాం నాగోరావ్, వివిధ సంఘాల పార్టీల నాయకులు, ఆదివాసీ సంఘాలు, విద్యార్థి, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూఎస్‌పీసీ రాష్ట్ర నాయకులు చరణ్‌దాస్, వైద్య శాంతికుమారి, సామ్యూల్ మాట్లాడారు. ప్రభుత్వం పీఆర్‌సీని ప్రకటించి అమలు చేయాలని కోరారు. పెండిగ్ డీఏలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సీసీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. 317 జీవో వల్ల నష్టపోయిన ఉపాధ్యాయులందరినీ వారి వారి స్వంత జిల్లాలకు పంపించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సర్దుబాటు జీవో 25 ను సవరించాలని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల 29 రోజుల సమ్మె కాలపు జీతాన్ని వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు హన్మంతరావు, గంగారాం, సమత కుమారి, హరీష్, ఉపన్న, హేమంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

యూరియా కొరత లేకుండా చర్యలు



తనిఖీ చేస్తున్న ఏవో శ్రీనివాసరావు

బెజ్జూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు యూరియా కొరత లేకుండా చూస్తామని చెప్పారు. అదే విధంగా రైతులకు నానో యూరియాపై అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారికి సూచించారు. ఎక్కువగా నానో యూరియా వాడకాన్ని రైతులు పెంచాలని దీంతో భూములు సారవంతంగా మారుతాయని అన్నారు. మొదటి దపాలో యూరియా వేసి రెండో దపాలో నానో యూరియాను మొక్కల మీద పిచికారి చేసినట్లయితే ఆకులు రసాన్ని పీల్చుకొని మొక్కకు బలాన్ని ఇస్తాయన్నారు. రైతులు సొసైటీలో యూరియా సక్రమంగా పంపిణీ కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. రైతులకు కొరత లేకుండా ఇవ్వాలని, అవసరమైన మేరకు ఇండెంట్ పంపించాలని సొసైటీ అధికారులకు సూచించారు. రైతులు నానో యూరియా వాడకాన్ని పెంచాలని సూచించారు. ఆయన వెంట టెక్నికల్ ఏడీఏ శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి నాగరాజు, ఏఈవోలు మీనా, మారుతి, శ్రీధర్, కార్యదర్శి సత్యనారాయణగౌడ్ ఉన్నారు.

కడుపు నొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య

మంచిర్యాలక్రైం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం భగవంతవాడకు చెందిన వివాహిత నీలిమ(37) పురుగుల మందు తాగి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం నీలిమకు గద్దెరాగిడికి చెందిన మానెం రాజేందర్‌తో వివాహం జరుగగా ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. రాజేందర్ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కొంత కాలంగా నీలిమ గర్భసంచి సమస్యతో బాధపడుతోంది. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా తగ్గకపోవడంతో ఇటీవవల తల్లిగారి ఇంటికి వచ్చిన నీలిమ ఈనెల 3న పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా ఆమె పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందింది. నీలిమ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


విద్యార్థులతో వెళ్తున్న ఆటో బోల్తా

ఇద్దరికి స్వల్ప గాయాలు

చెన్నూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారా యణపూర్ గ్రామ సమీపంలో పాఠశాల విద్యార్థులను తీసుకుని వెళ్తున్న ఆటో మంగళవారం అదుపు తప్పి బోల్తా పడింది. నారా యణపూర్ గ్రామం నుంచి మంగళవారం 9 మంది విద్యార్థులను ఆటోలో ఎక్కించ ుకుని బావురావుపేట సమీపంలోని ఆస్సీస్సీ పాఠశా లకు తీసుకువెళ్తున్నాడు. ఈ క్రమంలో మార్గమధ్యంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. గమనించిన చుట్టు పక్కల వారు ఆటోలోని విద్యార్థులను బయటకు తీసి వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఇందులో ఇద్దరు పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం జరిగిందని పలువురు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ దేవేందర్ తెలిపారు.

రోడ్లపైనే పశువులు

● ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు ● అధికారులు చర్యలు తీసుకోవాలని వినతి



జాతీయ రహదారిపై సంచరిస్తున్న పశువులు

వాంకిడి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండల కేంద్రంలోని జాతీయ రహదారి, సర్వీస్ రోడ్లపై పశువులు సంచరిస్తుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. జాతీయ రహదారిపైనే కాకుండా సర్వీస్ రోడ్డు, కాలనీల్లోని అంతర్గత రోడ్లపైనా ఇష్టారీతిన సంచరిస్తుండడం వల్ల ప్రజలకు ఇబ్బందికరంగా మారుతోంది. ద్విచక్రవాహనదారులు వాటిని తప్పించే ప్రయత్నంలో ప్రమాదాల బారిన పడి గాయపడుతున్నారు. కొన్ని సందర్భాల్లో రహదారిపై పశువులు పోట్లాడుకుంటూ పక్క నుంచి వెళ్లే వాహదారులపై పడుతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఇటీవల చోటు చేసుకున్న ఘటనలు..

ఇటీవల మండల కేంద్రంలోని సరండి చౌరస్తా సమీపంలో రహదారిపై ఉన్న పశువులు ఉండడంతో ద్విచక్రవాహనారుడు వాటిని తప్పించేయత్నం చేస్తుండగా మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో ఆ రెండు ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారు గాయపడ్డారు. మండల కేంద్రానికి చెందిన ఒక రైతు తన భార్యతో వ్యవసాయం పనులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వస్తుండగా రహదారిపై రెండు పశువులు పోట్లాడుకుంటు వచ్చి తాకాయి. వాహనంపై నుంచి రోడ్డుపై పడడంతో ఇద్దరికి గాయా లయ్యాయి. పశువులు రోడ్డుపై సంచరిస్తుండడంవల్ల ఇలాంటి సంఘటనలు అనేకంగా జరి గాయి. అధికారులు మాత్రం తమకేమి పట్టన ట్లుగా వ్యవహరిస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. రోడ్డుపై వదిలివేసిన పశువులకు ప్రమాదవశాత్తు ఏదైనా వాహనం తగిలి పశువుకు ప్రమాదం జరిగితే పోషకులు నష్టపరిహారం కోసం డిమాండ్ చేస్తున్నారు. కానీ ప్రతి రోజు రోడ్డుపై పశువులను వదిలివేయడం ఎంత వరకు సమంజసమని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. రోడ్డుపై ఉన్న పశువులను బంజరుదొడ్లో వేసేలా చూడాలని, పశువులను రోడ్లపై వదిలివేస్తున్న యజమానులపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

పశువుల సంచారంతో అవస్థలు..

దుర్గం శ్యాంరావు, అంబేద్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షుడు



నిత్యం పశువులు రోడ్డుపై సంచరిస్తుండడంతో వాహనదారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. రోడ్డు మధ్యలో పశువులు ఉండడంవల్ల వాటిని తప్పించ బోయే క్రమంలో ప్రమాదాలు జరిగి వాహన దారులు గాయ పడుతున్నారు. ఇలా రోడ్లపై పశువులు సంచరిస్తున్నా పంచాయతీ అధికారులు మాత్రం పట్టించు కోవడం లేదు. పశువులను రోడ్డుపై వదిలివేస్తున్న యజమానులకు జరిమానాలు విధించడం ద్వారా కట్టడి చేసే అవకాశం ఉంది.

అన్నా బావు సాఠే సేవలు చిరస్మరణీయం

జైనూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): దళితుల ఉన్నతి కోసం సాహిత్యం ద్వారా అన్నా బువు సాఠే చేసిన సేవలు చిరస్మరణీయమని న్యాయవాది గాయక్‌వాడ్ దత్తాత్రి అన్నారు. మండలంలోని జామ్ని సడక్ గూడలో మంగళవారం నిర్వహించిన అన్నా బావు సాఠే జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా దళితులు తమ తమ పిల్లల్ని విద్యావంతులుగా తయారు చేయాల్సిన అవసరం ఉందన్నారు. చదువుతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. దేశ విదేశాల్లో అనాడు దళితుల పరిస్థితిని తన సాహిత్యం ద్వారా ప్రచారం చేసిన మహా మేధావి అన్నా బావు సాఠే అని ఆయన కొనియాడారు. అన్నా బావు సాఠే ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాంగ్ సమాజం జిల్లా అధ్యక్షుడు మవాలె దత్త, జామ్ని మాజీ సర్పంచ్ మేస్రాం రాహుల్, మాజీ ఉప సర్పంచ్ డోంగ్రే సమాధాన్, నాయకులు దుదానె కరణ్, కోటంబే శ్రీ హరి, భరత్, దిలిప్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైకి వచ్చిన చెట్లు.. పొంచి ఉన్న ప్రమాదం



రోడ్డుపైకి వచ్చిన చెట్ల కొమ్మలు

తాండూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండూర్ నుంచి భీమినికి వెళ్లే రెండు వరుసల రహదారి పైకి చెట్ల కొమ్మలు రోడ్డుపైకి వచ్చాయి. రహదారిపైకి సగం వరకు రావడంతో వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రహదారి గుండా అధికారులు ప్రయాణాలు చేస్తుంటారు. మూల మలుపుల వద్ద కూడా రహదారికి రెండు వైపులా చెట్లు ఏపుగా పెరిగి సగం వరకు రావడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. అధికారులు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఘనంగా గాజుల మహోత్సవం



త్రిశక్తి అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మందమర్రిటౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని త్రిశక్తి అష్టలక్ష్మీ అమ్మవారి దేవాలయంలో మంగళవారం గాజుల మహోత్సవం పూజలు వైభవంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. పసుపు కుంకుమలతో గాజులు పెట్టి పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని గాజులతో అలంకరించారు.

14 రకాల నిత్యావసరాలు అందజేయాలి

జన్నారం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో తెల్లరేషన్‌కార్డుదారులందరికీ కేరళ తరహాలో 14 రకాల నిత్యావసర సరుకులు అందించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. సోమవారం మండల శాఖ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేరళలో సీపీఎం పార్టీ అధికారంలో ఉండి ప్రతి తెల్లరేషన్‌దారుడికి 14రకాల రేషన్ సరుకులు అందజేస్తుందని తెలంగాణలో ఎందుకు సాధ్యపడదని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బుచ్చన్న, రాజన్న, అంబటి లక్ష్మణ్, పోటు విజయ, యశోధ, గుడ్ల రాజన్న, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ తరగతుల పరిశీలన

జన్నారం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టాపూర్ పాఠశాలలో దిక్సూచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ద్వారా అమెరికా నుంచి ప్రారంభించిన బోధన తరగతులను జిల్లా విద్యాధికారి యాదయ్య మంగళవారం పరిశీలించారు. ఇలాంటి ఆన్‌లైన్ తరగ తులు అక్కెపల్లిగూడ, ధర్మారం, రేండ్లగూడ, చామనపల్లి, పొన్కల్, పాఠశాలల్లో ఇప్పటికే ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, మధుసూదన్, రాంటెంకి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆదివాసీల సమస్యలపై చర్చ

సిర్పూర్(యు), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నాందేడ్ జిల్లా కిన్వాట్ నియోజకవర్గం ఎమ్మెల్యే కేరం భీమ్‌రావును మంగళవారం ఆయన నివాసంలో సిర్పూర్(యు)మండల ఆదివాసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలపై చర్చించారు. తెలంగాణ, మహారాష్ట్రలో ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయనతో మండల నాయకులు చర్చించారు. ఆదివాసీలు తమ సంస్కృతీ సంప్రదాయలు పరిరక్షించాలన్నారు. జన గణనలో ఆదివాసీలకు గతంలో ఉన్న ధర్మకాలంను కేటాయించవాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, మండల వీటీడీఏ చైర్మన్ కుమ్ర భీమ్‌రావు, మాజీ సర్పంచ్ ఆర్క, ఆత్రం బల్వంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో ఒకరి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శశిధర్‌రెడ్డి

రామకృష్ణాపూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గద్దెరాగడి భవాని రెస్టారెంట్ వద్ద హరీశ్ అనే యువకుడిపై దాడి చేసిన ఘటనలో పంగ శ్రీధర్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి తెలిపారు. మంగళవారం దాడికి సంబంధించిన వివరాలను సీఐ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ నెల 3న రాత్రి పదిగంటల సమయంలో భవాని రెస్టారెంట్ వద్ద హరీశ్‌ను ఉద్దేశపూర్వకంగా పంగ శ్రీధర్ స్నేహితులు కుర్మ మహేందర్, కుదురుపాక తిరుపతితో కలిసి దాడి చేసి గాయపరిచారు. హరీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా పంగ శ్రీధర్‌ను అరెస్టు చేశామని మిగితా ఇద్దరు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోనున్నట్లు సీఐ తెలిపారు. సమావేశంలో రామకృష్ణపూర్ ఎస్ఐ రాజశేఖర్, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

అక్రమంగా డీజిల్ నిల్వ.. కేసు నమోదు

జైపూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సరైన అనుమతులు లేకుండా అక్రమంగా డీజిల్ నిల్వ చేయడంపై కేసు నమోదు చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య తెలిపారు. మంగళవారం తనిఖీల్లో భాగంగా మండలంలోని కిష్టాపూర్ గ్రామం పరిధిలోని రొమ్మిపూర్ ఆమ్లెట్ గ్రామంలో సరైన అనుమతులు లేకుండా అక్రమంగా డీజిల్ నిల్వ చేసిన మెగా ఇంజనీరింగ్ అండ్ మెగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ డీజిల్ బంక్‌పై కేసు నమోదు చేశామన్నారు. డిజిల్ బంక్ వారు ఫామ్ బీ అనుమతి లేకుండా అక్రమంగా 8,141 లీటర్ల డిజిల్ ట్యాంకుల్లో నిల్వ చేశారని, తెలంగాణ పెట్రోలియం ప్రొడక్ట్ 2016 ప్రకారం ఎవరైనా 2,500 లీటర్ల కంటే ఎక్కువ డీజిల్ నిల్వ చేసుకున్న వారు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలన్నారు. లైసెన్స్ లేకుండా డీజిల్ నిల్వ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు పాల్గొన్నారు.

దాడి ఘటనలో ఇద్దరు నిందితుల అరెస్టు



మాట్లాడుతున్న ఎస్సై అంజనేయులు

కాసిపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాసిపేట పోలీసు స్టేషన్ పరిధిలోని కోమటి చేనుకు చెందిన ఇద్దరి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కాసిపేట ఎస్ఐ అంజనేయులు తెలిపారు. మంగళవారం కాసిపేట పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. గత 25న కోమటి చేనుకు చెందిన రాంటెంకి శివరాంపై అదే గ్రామానికి చెందిన జాడి రవి, జాడి సాయికుమార్‌లు కత్తితో దాడి చేసి గాయపరిచారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు అనంతరం ఇద్దరి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

రైలు కింద పడి ఒకరి ఆత్మహత్య

కాగజ్‌నగర్ టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ రైల్వే ఫ్లై ఓవర్ సమీపంలో మంగళవారం రైలు కింద పడి ఎం డి షబ్బీర్ అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సురేష్ గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కాపువాడకు చెందిన షబ్బీర్ (52) గత కొంత కాలంగా మద్యానికి బానిసై ఇంట్లో తరుచూ గొడవ పడుతుండేవాడు. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురై గూడ్సు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని, కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు.



టీబీజీకేఎస్ పిట్ కమిటీ నియామకం

జైపూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఇందారం 1ఏ గనిలో మంగళవారం టీబీజీకేఎస్ నూతన పిట్ కమిటీని ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, కేంద్రం ఆర్గనైజింగ్ సెక్రటరీ అన్వేష్‌రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో నియమించారు. పిట్ సెక్రటరీగా గడ్డం మల్లయ్య, అసిస్టెంట్ సెక్రటరీగా రామారావు, ఏ రిలేసెక్రటరీగా నరసింహస్వామి, బి రిలే సెక్రటరీగా మారం శ్యాంకుమార్, సీ రిలే సెక్ర టరీగా రాజశేఖర్, డీ రిలే సెక్రటరీగా నరేష్, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జీగా శ్రీనివాస్, సోషల్ మీడియా ఇన్‌చార్జీగా మహేందర్, అడ్వైజర్స్‌గా శ్రీరామ్, విజయ్‌తో పాటు 22 మంది ఎగ్జిక్యూటివ్ సభ్యులను ఎన్నుకున్నారు.

నూతన గనుల ఏర్పాటే లక్ష్యం

మందమర్రిటౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో భావితరాల ఉపాధి అవకాశాల కోసం నూతన గనుల ఏర్పాటే లక్ష్యంగా తమ యూనియన్ సెక్రటరీ జనరల్ రాష్ట్ర కనీస వేతనాల సలహాదారుల సంఘం బి. జనక్ ప్రసాద్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షులు కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షులు దేవి భూమయ్య అన్నారు. ఐఎన్‌టీయూసి కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ సింగరేణిలో గెలిచినటువంటి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసి ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తుందో జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ చీఫ్ ఆర్గనైజర్ సెక్రటరీ రాంశెట్టి నరేందర్, నాయకులు భిక్షపతి, అంజనేయులు, సదయ్య, శంకర్‌రావు, వెంకటస్వామి, ఆయా గనుల ఫిట్ కార్యదర్శులు పాల్గొన్నారు. కాగా ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ యూనియన్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ కాంపెల్లి సమ్మయ్య జన్మదిన వేడుకలు మంగళవారం ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సత్యనారాయణ

మందమర్రిటౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఉద్యోగులకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తూ వస్తున్నామని ఏఐటీయూసీ ఏరియా బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ అన్నారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సొంతింటి కల పథకాన్ని అమలు చేసే విధంగా యాజమాన్యం ఒత్తిడి తెస్తున్నామని తెలిపారు. కార్మికులకు సంబంధించిన స్పెర్క్స్‌పై ఇన్‌కంటాక్స్‌ను యాజమాన్యమే చెల్లించాలని కోరుతున్నామని అన్నారు. సింగరేణిలో పాత గనులు మూతపడే దశకు చేరుకున్నాయని నూతన గనులు ఏర్పాటు చేయాలని ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నామని చెప్పారు., కార్మిక సమస్యలపై అవగాహన లేనటువంటి సీఐటీయూ నాయకులు తమ సంఘంపై బురద జల్లే ప్రయత్నం చేయడం సిగ్గు చేటన్నారు. సీఎండీతో నిర్వహించిన స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో ఈ అంశాలన్నింటిని వివరించామని తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సాధించిన లాభాలను యాజ మాన్యం వెల్లడించాలని కోరారు. ఉద్యోగులకు 35శాతం చెల్లించాలని డిమాండ్ చేశారు. రక్షణకు సంబంధించి కూడా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఒత్తిడితెస్తున్నామని తెలిపారు. ఉద్యోగుల హక్కుల సాధనకు ఏఐటీయూసీ అండగా నిలుస్తుందని తెలిపారు. సింగరేణిలో కాలం చెల్లినటువంటి సంఘాల మాటలను కార్మికులు పట్టించుకునే స్థితిలో లేరని తెలిపారు. సమావేశంలో నాయమకులు భీమనాథుని సుదర్శన్, కంది శ్రీనివాస్, సోమిశెట్టి రాజేశం, గాండ్ల సంపత్, జట్టి మల్లయ్య, ఎగ్గటి రాజేశ్వర్‌రావు, బానయ్య పాల్గొన్నారు.

పదోన్నతుల్లో బీసీ ఉద్యోగులకు అన్యాయం



సమావేశంలో నినాదాలు చేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : సింగరేణిలో నిర్వహించే పదోన్నతుల్లో బీసీ ఉద్యోగులకు అన్యాయం జరుగుతోందని పలువురు నాయకులు ఉన్నారు. సింగరేణి కాలరీస్ బీసీ, ఓబీసీ ఎంప్లాయిస్ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్-నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర నాయకులు ముష్కె సమ్మయ్య, పేరం రమేష్ హాజరై మాట్లాడారు. యాక్టింగ్ బేస్ పదోన్నతుల్లో బీసీలకు న్యాయం జరగాల్సిన అవసరం ఉందన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టులకు రీ నోటిఫికేషన్ ఇచ్చి ఉద్యోగులను భర్తీ చేయాలని కోరారు. మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహాన్ని జీఎం కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేయాలని, ప్రగతి స్టేడియం పేరును మహాత్మా జ్యోతీబాపూలే స్టేడియంగా నామకరణం చేయాలని కోరారు. అన్ని గనులు, విభాగాల్లో పనిచేసే ఉద్యోగులతో సంఘం బలోపేతానికి కృషి చేయాలని తీర్మానించారు. ఈ సమావేశంలో బ్రాంచ్ కార్యదర్శులు బరపటి మారుతి, బద్రి బుచ్చయ్య, సహాయ కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, కోశాధికారి మల్లేష్, పిట్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

శ్రీరాంపూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి. రియాజ్ అహ్మద్ అన్నారు. యూనియన్ కేంద్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు తిప్పారపు సారయ్య అధ్యక్షతన కొత్తగూడెం రుద్రంపూర్‌లో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రియాజ్ అహ్మద్ హాజరై మాట్లాడుతూ, ఇటీవల నిర్వహించిన మెడికల్ బోర్డులో రిఫరల్ కార్మికులకు అన్యాయం జరిగిూందన్నారు. పదో తరగతి పాస్ కాలేదని, కార్మికుల వారసులకు ఉద్యోగాలు ఇవ్వకుండా విజిలెన్స్ విచారణ పేరుతో పెండింగ్‌లో పెట్టడం సరికాదన్నారు. అలవెన్సులపై ఆదాయపు పన్ను మినహాయింపు ఇవ్వాలని, అండర్‌గ్రౌండ్‌లో సూపర్‌వైజర్లుగా పనిచేస్తూ అన్‌ఫిట్ అయిన వారికి వేతన నష్టం జరుగకుండా సూటబుల్ జాబ్ ఇవ్వాలని, ఎంవీ డ్రైవర్ పోస్టులు భర్తీ చేసేందుకు పరీక్షలు నిర్వహించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సర్ఫేస్ మజ్దూర్ ఖాళీలను సీనియర్లతో వెంటనే భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గడిపల్లి కృష్ణప్రసాద్, కొత్తగూడెం వైస్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, కార్యదర్శి ఎండీ ఆసిఫ్, కేంద్ర కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలి



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

శ్రీరాంపూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకులో రక్త నిల్వల కొరత ఉందని, వెంటనే రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ చైర్మన్ కె భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రక్తనిధి కేంద్రం ఇన్‌చార్జి వి మధుసూదన్ రెడ్డి కోరారు. ఈ మేరకు వారు శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్‌కు మంగళవారం వినతి పత్రం అందించారు. ఈ సదర్భంగా జీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ అనేక సమాజ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. వారికి సింగరేణి ఆధ్వర్యంలో అన్ని రకాల సహకారం అందిస్తున్నామని చెప్పారు. త్వరలో శిబిరం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

క్రీడాకారులపై యాజమాన్యం నిర్లక్ష్యం

శ్రీరాంపూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేసే కార్మిక క్రీడాకారులపై యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా ఆరోపించారు. స్థానికంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడాకె, క్రీడాకారులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తామని చెప్తున్న యాజమాన్యం ఆచరణలో అమలు చేయడం లేదన్నారు. కనీసం క్రీడా దుస్తులు, బూట్లు, ఇతర మెటీరియల్ సరఫరా చేయడం లేదన్నారు. పాత సామగ్రితో క్రీడాకారులు ప్రాక్టీస్ చేస్తున్నారని, సొంత ఖర్చులతో సామగ్రి కొనుగోలు చేసి పోటీల్లో పాల్గొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో కోల్ ఇండియా స్థాయిలో ఏర్పాటు చేసే పోటీల్లో దాదాపు రెండు వేల మంది ఉద్యోగులు పాల్గొంటున్నారని తెలిపారు. క్రీడాకారులకు బడ్జెట్ పెంచాలని ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడేళ్లుగా స్పోర్ట్స్ ఆఫీసర్ లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. స్పోర్ట్స్ సూపర్‌వైజర్లు ఏళ్ల తరబడి ఉండడంతో అవినీతికి పాల్పడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, సహాయ కార్యదర్శి వెత్కూరి కొమురయ్య, ఏరియా కార్యదర్శులు ప్రసాద్ రెడ్డి, బద్రి బుచ్చయ్య, సంపత్, మూడ సుధాకర్, అఫ్రోజ్‌ఖాన్, అడ్డు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులకు బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒరగబెట్టిందేమి లేదు

దేశానికి రక్ష ప్రధాని మోదీ



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

మందమర్రిటౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో అతి పెద్ద పరిశ్రమ అయిన సింగరేణి సంస్థలో ఉద్యోగులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఒరగబెట్టిందేమి లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు మండిపడ్డారు. సింగరేణి కార్మికుల హక్కులకు అండగా ఉంటామన్నారు. మంగళవారం రాత్రి పట్టణంలోని జాతీయ రహదారి మందమర్రి , బెల్లంపల్లి, మంచిర్యాల, గోదావరిఖని నాలుగు రోడ్ల కూడలి వద్ద నిర్వహించిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశానికి రక్ష ప్రధాని మోదీ అని పేర్కొన్నారు. పదేండ్ల పాలనలో దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత మోదీయేనని తెలిపారు. సింగరేణిలో నిధులను కూడా దారి మళ్లించారని మండిపడ్డారు. పెద్దపల్లి మాజీ ఎంపీ వెంకటేష్ నేత మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ అంజయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్,ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, నాయకులు శ్రీనివాస్, ఎర్రబెల్లి రఘునాథ్‌రావు, శ్రీనివాస్, ఏమాజీ, చప్పిడి నరేష్, సంజీవరావు, దీక్షితులు పాల్గొన్నారు.

మంచిర్యాలలో ఉన్నత న్యాయ స్థానం ఏర్పాటుకు కృషి

మంచిర్యాలకలెక్టరేట్, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలో ఉన్నత న్యాయ స్థానం కోసం కృషి చేస్తానని కోర్టు నిర్మాణ పనులు కూడ వేగంగా పూర్తి చేసేందుకు కేంద్ర మంత్రితో మాట్లాడుతానని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికి అనంతరం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, కన్స్యూమర్ కోర్టులను ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు మంత్రితో మాట్లాడి నిధులకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు బండవరపు జగన్, మురళీధర్‌రావు, భుజంగరావు, రాజమల్లు, శ్రీనివాస్, ఆంజనేయులు, రాంచందర్, లచ్చన్న పాల్గొన్నారు.

రాజ్యాధికారంతోనే దళితుల అభివృద్ధి

మందమర్రిటౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాధికారంతోనే దళిత, బహుజనుల, మైనార్టీల అభివృద్ధి సాధ్యమని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అతెవాలే) జిల్లా అధ్యక్షుడు తుంగపిండి రమేష్ తెలిపారు. మంగళవారం మందమర్రి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పట్టుమని పది శాతం లేని అగ్రకులాలు అధికారాన్ని చెలాయిస్తున్నాయని, ఆ పార్టీలకు జెండాలను మోసి శ్రామికులుగా ఇతర కులాలు మిగిలిపోతున్నాయన్నారు. రాబోయే ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ పలు హామీలతో ముందుకు వస్తుందన్నారు. అనంతరం పలువురు పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీ రహమత్‌ఖాన్, పులిపాక శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, లక్కాకుల శ్రీనివాస్, కృష్ణ, దర్శనాల వెంకటస్వామి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

తాండూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం పేర్కొన్నారు. మంగళవారం మండల ఎంఈవో కార్యాలయంలో సిబ్బందికి వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ఐదు నెలలుగా మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు చెల్లించక పోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చే బడ్జెట్‌కు రెండు కోడిగుడ్లు కూడా రావని, మూడు గుడ్లు ఇవ్వాలని అధికారులు ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న వేతనాలు, బిల్లులు చెల్లించాలని కోరారు. వరలక్ష్మీ, కమల, సరిత పాల్గొన్నారు.

అదుపు తప్పుతోంది..

- చిన్నారుల ప్రాణాలతో చెలగాటం
- పరిమితికి మించి ఆటోల్లో విద్యార్థుల తరలింపు
- నిబంధనలు పాటించని ఆటో డ్రైవర్లు
- పట్టించుకోని అధికారులు



బెల్లంపల్లి, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆటోలు నిబంధనలకు విరుద్ధంగా పిల్లలను పాఠశాలలకు తీసుకెళ్తున్నాయి. అర్హతలేని డ్రైవర్లు విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. పాఠశాల విద్యార్థులను తలరించేందుకు ఆటోల్లో టాటా ఏసీ వాహనాల్లో పరిమితికి మించి ప్రతి రోజు విద్యార్థులను ఎక్కించుకొని నిబంధనలకు విరుద్ధంగా వేగంగా వెళ్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఆటోలపై సంబంధిత రవాణ పోలీసు అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో జిల్లాలో ఇటీవల విద్యార్థులను తరలిస్తున్న ఆటోలు ప్రమాదానికి గురవుతున్న సంఘటనలు తరుచు చోటు చేసుకుంటున్నాయి.

భద్రత ప్రశ్నార్థకం..

విద్యార్థులను ఆటోల్లో చేర్చే భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. ఆటో డ్రైవర్ల అత్యాశ కారణంగా ఒక్కో ఆటోలో పది నుంచి 14 మంది విద్యార్థులను తీసుకెళ్తున్నారు. పాఠశాలల ఆటోలకు విద్యార్థులను ఎక్కువ మందిని తీసుకెళ్లే విధంగా ఆటోల్లో డ్రైవర్ పక్కనే కూర్చునే విధంగా వెల్డింగ్‌షాపుల్లో సీట్లను ఏర్పాటు చేస్తూ ప్రమాదకరంగా విద్యార్థులను తీసుకెళ్తున్నారు. టాటా ఏ సీ వాహనాల్లో అయితే 20 మందికి పైగా విద్యార్థుల ను పాఠశాలలకు తీసుకెళ్తున్నారు. విద్యార్థులతో పాటు ఆటోలకు ఇరువైపుల పాఠశాల బ్యాగులను వేలాడ తీస్తూ ప్రమాదకరంగా ప్రయాణం సాగిస్తున్నారు. నిబంధనలను విరుద్ధంగా విద్యార్థులను ఓవర్‌లోడ్‌తో తీసుకెళ్తుండడమే కాకుండా అతి వేగంగా డ్రైవర్లు ఆటోలను నడిపిస్తున్నారు.

పాఠశాల సమయం ముగుస్తుందని, గేటు వేస్తారని ముందువెనుక చూసుకోకుండా అతి వేగంతో ప్రమాదాలకు కారణమవుతున్నారు. ప్రైవేటు బస్సులకు ఫీజులు చెల్లించే స్తోమత లేని కారణంగా తప్పని పరిస్థితుల్లో తమ పిల్లలను తల్లిదండ్రులు ఆటోల్లో పంపిస్తున్నారు. అంతేగాకుండా పలు గ్రామాల్లో ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో తల్లిదండ్రులు ఆటోను ఆశ్రయిస్తున్నారు. టాటా మ్యాజిక్ లాంటి వాహనాలను పాఠశాలకు విద్యార్థులించేందుకు జిల్లాలో ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. సాధారణంగా ఆటోల్లో విద్యార్థులను ఆరుగురికి మించి ఎక్కించుకోరాదు. టాటా మ్యాజిక్‌లో 10 మంది మించకూడదు. అలాగే స్కూలు ఆటోలకు విద్యార్థులు కిందపడకుండా సైడు రాళ్లను తప్పకుండ అమర్చాలి. డ్రైవర్ యూనిఫాం తప్పని సరిగా ధరించాలి. ఈ నిబంధనలు పాటించ కుండా పరిమితికి మించి ప్రమాదకరంగా విద్యార్థుల ను ఆటోల్లో తీసుకెళ్తున్నారు.

పట్టించుకోని అధికారులు...

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆటో డ్రైవర్లు పాఠశాల విద్యార్థులను ప్రమాదకరంగా తీసుకెళ్తున్నప్పటికీ సంబంధిత పోలీసు, రవాణశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. అర్హతలేని ఆటో డ్రైవర్లు ఫిట్‌నెస్ లేని వాహనాలతో పరిమితికి మించి విద్యార్థులను ప్రతి రోజు తరలిస్తున్న తనిఖీలు చేపట్టడం లేదనే ఆరోపణలున్నాయి.

జిల్లాలో ఏదైన ప్రమాదం జరిగితేనే పోలీసులు, రవాణ శాఖ అధికారులు వాహనాలు తనిఖీలు చేపడుతున్నారే తప్ప తదనంతరం తనికీలు చేపట్టకపోవడంతో డ్రైవర్లు తమ ఇష్టానుసారంగా ఎక్కువ మంది పిల్లలను తరలిస్తున్నారు. క్రమం తప్పకుండా పాఠశాల సమయంలో సంబందిత అధికారులు పకడ్బందీగా తనిఖీలు చేపట్టి ఆటో డ్రైవర్లకు రహదారి నిబంధనలపై అవగాహన కల్పిస్తే ప్రమాదాల నివారణకు అడ్డుకట్ట వేయవచ్చు అనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా ముందస్తు రక్షణ చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



జిల్లాలో ఇటీవల జరిగిన సంఘటనలు కొన్ని..

- బెల్లంపల్లి పట్టణంలో ఆరేళ్ల బాలుడు పాఠశాల ముగిసిన అనంతరం ఆటోలో ఇంటికి వెళ్తున్న క్రమంలో డ్రైవర్ అతివేగంతో మూల మలుపు వద్ద తిప్పడంతో బాలుడు ఆటో కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు.
- జైపూర్ మండలంలో పరిమితికి మించి టాటా ఏసీ వాహనంలో విద్యార్థులను తీసుకెళ్తున్న క్రమంలో అదుపు తప్పి వాహనం బోల్తాపడింది. ఈఘటనలో విద్యార్థులకు గాయాలయ్యాయి.
- మందమర్రిలో ఆటోలో 12 మంది విద్యార్థులను పాఠశాలకు తీసుకెళ్తున్న సమయంలో అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో పలువురి విద్యార్థులకు గాయాల య్యాయి.
- చెన్నూర్ మండలం నారాయణపూర్ వద్ద ఓ ఆటోలో పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తుండడంతో ఆటో బోల్తాపడడంతో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి.

మళ్లీ ముదిరిన పోడు లొల్లి

మొక్కలు తొలగించిన అటవీ శాఖ అధికారులు
ఫారెస్టు అధికారులపై తిరగబడ్డ ఆదివాసీ మహిళలు

దండేపల్లి ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పోడు వ్యవసాయం కోసం కొంత కాలంగా తాళ్లపేట అటవీరెంజ్ పరిధిలోని లింగాపూర్ అటవీ రిజర్ ఫారెస్ట్‌లో ఆదివాసి గిరిజనులు పోడు వ్యవసాయం చేస్తున్నారు. దీంతో గిరిజనులు అటవీ శాఖ అధికారుల మధ్య పోడు లొల్లి ఆగడం లేదు. లింగాపూర్ అటవీ బీట్‌లో ఇటివల పోడు భూముల్లో ఆదివాసి గిరిజనులు సాగు చేసిన మొక్కలను మంగళవారం అటవీ శాఖ అధికారులు, సిబ్బంది తొలగించడంతో వివాదం మొదలైంది. దీంతో మహిళలు తిరగబడటంతో వారి మధ్య వాగ్వావాదం చోటు చేసుకుంది. తాతల కాలం నుంచి పోడు వ్యవసాయం చేస్తున్నామని ఇప్పుడు అధికారులు వచ్చి సాగు చేసిన పంటను నాశనం చేశారని వారు మండిపడ్డారు. ఫారెస్టు అధికారులు విచక్షణ రహితంగా వ్యవహరిస్తూ తమపై దాడులకు దిగుతున్నారని వారు ఆరోపించారు. దీంతో అటవీశాఖ అధికారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో దండేపల్లి తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, లక్సెట్టిపేట సీఐ రమణమూర్తి, ఎస్సై తహసీనోద్దీన్ సిబ్బంది సంఘటనస్థలాని చేరుకున్నారు. సాగు చేసిన పంట మొక్కలను తాళ్లపేట అటవీ రెంజ్ అధికారి సుష్మరావు సమక్ష్యంలో సిబ్బంది తొలగించారు. దీంతో అక్కడే ఉన్న మహిళలు అధికారులపై తిరగబడ్డారు. పోలీసులు, అటవీ శాఖ అధికారులు వారికి ఎంత నచ్చజెప్పిన వినలేదు. దీంతో జన్నారం ఎఫ్‌డివో రామ్మోహన్ కు సమాచారం అందించారు. హుటహుటిన ఎఫ్‌డివో అక్కడికి చేరుకుని వారికి నచ్చజెప్పారు. దీంతో గిరిజన మహిళలందరు అతడి కాళ్లపై పడి ప్రాధేయపడి న్యాయం చేయాలని కోరారు. ఇది కవ్వాల్ టైగర్ రిజ్వర్ ఫారెస్టు కావడంతో ఇక్కడ అటవీ భూములో పోడు వ్యవసాయ చేయరాదన్నారు. ఇప్పటి కైన మీరు ఇక్కడి వెళ్లితే మీకు, మీ పిల్లలకు ఉపాధి అవకాశం కల్పిస్తామని ఎఫ్‌డివో హామీ ఇచ్చారు. అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అయినా వారు వినకుండా అక్కడే రాత్రి వరకు ఉండిపోయారు. చేసిది లేక అటవీ శాఖ అధికారులు వెళ్లిపోయ్యారు. దీంతో పోలీసులు గిరిజనులకు నచ్చజెప్పే యత్నం చేశారు.



ఆదివాసీలతో మాట్లాడుతున్న అధికారులు

ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

తహసీల్దార్ క్రిష్ణ



ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ భూముల పరిరక్షణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జవాబు : ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ప్రభుత్వ భూములపై నిఘా పెట్టి ఎవరైన ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలతో పాటు భూమిని స్వాధీనం చేసుకుంటున్నాం. ప్రభుత్వ భూమిని ఎవరైన కబ్జా చేస్తే తమదృష్టికి తీసుకురావాలి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మున్సిపల్, రెవెన్యూ అధికారులందరం కలిసికట్టుగా కృషి చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: రెవెన్యూ సదస్సుల్లో భూముల పరిష్కారానికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించాం. ఇందులో భాగంగా దాదాపు 2వేలకు పైగా భూములకు సంబంధించిన సమస్యలకు దరఖాస్తులు చేసుకున్నారు. సిబ్బందితో క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యక్రమాలతో ముందుకు వెళ్తున్నాం. ప్రభుత్వం విధించిన గడువు లోపు సమస్యలు పరిష్కరిస్తాం.

ఆంధ్రజ్యోతి: లబ్ధిదారులు రేషన్‌కార్డులు దరఖాస్తు చేసుకునే సమయం ఎప్పటి వరకు ఉంది?

జవాబు: ప్రస్తుత ప్రభుత్వం రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని నిరంతర ప్రక్రియ సూచించింది. అర్హులైన లబ్ధిదారులు రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలి. దళారుల ప్రమేయం లేకుండా ప్రజలకు ఎటువంటి సమస్య ఉన్న నేరుగా తహసీల్దార్ కార్యాలయంలో కలువవచ్చు.

పుస్తకాలు, బ్యాగులు పంపిణీ

కాసిపేట, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): కాసిపేట మండలంలోని దేవాపూర్, రాంపూర్ గిరిజన ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మాదిగ హక్కుల దండోర నాయకులు పుస్తకాలు, పలకలు, పెన్నులు, బ్యాగులు, చెప్పులు అందజేశారు. మాదిగ హక్కుల దండోర మండల అధ్యక్షుడు అట్కాపురం రమేశ్, పెద్ద నర్సయ్య, చొప్పదండి వెంకటేశ్, మాంద్ర నవీన్, కొత్తూరు నర్సయ్య, కర్రావుల సాయి, మహిళలు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మందమర్రిటౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెండో జోన్‌కు చెందిన శని గారపు కార్తీక్(30) మంగళవారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే మృతి చెందాడు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక ఎస్ఐ రాజశేఖర్ సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

కన్నెపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణపనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. మంగళవారం కన్నెపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ ఆసుపత్రులను ఏర్పాటు చేస్తుందన్నారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం కస్తూర్బా విద్యాలయాన్ని సందర్శించారు. విద్యార్థినులకు కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. భోజనం తయారీలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసర సరుకులు వినియోగించాలన్నారు. మెను ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు.

వర్షాకాలం దృష్ట్యా అంటు వ్యాధులు వ్యాప్తి చెందకుండా పాటించాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించాలన్నారు. తరగతి గదులు, వంటశాలలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పదవ తరగతి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఏకాగ్రతతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఏపీవో శ్రీనివాస్, కార్యదర్శి రాజ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి

జైపూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్‌రాజ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కుందారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి వైద్య సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను, అసంక్రమణ వ్యాధులపై నిఘా ఉంచాలన్నారు. వంద శాతం గర్భవతుల నమోదు, ఆసుపత్రుల్లో ప్రసవాలు చేయించాలని, స్కానింగ్ చేయించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో స్త్రీల నిష్పత్తి తగ్గుతున్నందున ప్రజల్లో దీనిపై అవగాహన కల్పించాలన్నారు. తెలంగాణ డయాగ్నొస్టిక్స్ ద్వారా 72 రకాల పరీక్షలను ఉచితంగా అందిస్తున్నందున ప్రజలందరికీ దీనిపై అవగాహన కల్పించాలన్నారు. వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవ లందించాలన్నారు. జిల్లా అధికారులు, కలెక్టర్‌లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేస్తున్నారని, అందరు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు, వైద్యాధికారులు శ్రావ్య, స్పందన, సుప్రవిజ, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్

తల్లిపాల వారోత్సవాలు

బెల్లంపల్లి, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చొప్పరపల్లి సెక్టార్ పరిధిలో గల స్టేషన్ రోడ్డులో అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్ వైజర్ పుష్పలత, అంగన్వాడీ టీచర్ సంగీతలు మాట్లాడుతూ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. మూఢనమ్మకాలను వదిలి తల్లి బిడ్డకు పుట్టిన మొదటి రోజు నుంచే పాలు ఇవ్వాలని సూచించారు. తల్లిపాలల్లో ఖనిజాలు, మాంసకృత్తులు, పోటీన్లు, విటమిన్లు పుష్కలంగా ఉంటాయని బిడ్డ ఎదుగుదలకు ఎంతో శ్రేయస్కరం అన్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు.

రైతులకు వీసీ ద్వారా పంటలపై మెళకువలు

నస్పూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : సీతారాంపల్లి రైతులో మంగళ వారం వ్యవసాయ రంగంలో రైతులు సాగు చేసే పంటలపై వీసీ రైతు నేస్తం ద్వారా రైతులకు మెలకువలు, దిగుబడులపై సూచనలు, సలహాలను ఇచ్చారు. ప్రతి మంగళవారం రైతు వేదిక వద్ద రైతు నేస్తం కార్యక్రమం నిర్వహణ ఉంటుందని, రైతుల సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చత్రూ నాయక్ కోరారు. కార్యక్రమం అనంతరం స్థానికంగా ఉన్న ఎరువుల దుకాణాలను వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీ చేశారు. డివిజన్ ఏడీఏ అనిత, మండల వ్యవసాయ అధికారి మహేందర్, ఏఈ తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే చర్యలు తప్పవు

బెల్లంపల్లి, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): చట్ట వ్యతిరేక పనులకు ఎవరైన పాల్పడితే చర్యలు తప్పవని బెల్లంపల్లి రూరల్ సీఐ హనూక్ అన్నారు. మంగళవారం చంద్రవెల్లి గ్రామంలో పోలీసు కమ్యూనిటీ కాంట్రాక్టు ప్రోగ్రాంను నిర్వహించారు. సీఐ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టి పత్రాలు లేని 38 ద్విచక్రవాహనాలు, 14 ఆటోలు, ఒక ట్రాలీని సీజ్ చేశారు. ఓ మహిళ ఇంటిలో పది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు.

ఆటో టైర్లు దొంగతనం

తాండూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అచ్చలాపూర్ గ్రామంలోని ఎస్సీ వాడలో రాకేష్ అనే ఆటో డ్రైవర్‌కు చెందిన ఆటోకు ఉన్న మూడు చక్రాలను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి దొంగతనం చేశారు. బాధితుడు తాండూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలి

వేమనపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని చెన్నూరు రూరల్ సీఐ బన్సీలాల్ కోరారు. మంగళవారం మండలంలోని దస్నాపూర్ గ్రామంలో కార్డెన్‌సర్చ్ నిర్వహించారు. గ్రామంలో తనిఖీలు నిర్వహించిన సరైన పత్రాలు లేనని 30 బైక్‌లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

గుడుంబా నిర్మూల నకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సురేష్, టీజీఎస్‌పీ పోలీసులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

దండేపల్లి ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలం నంబాలలో ఆర్థిక ఇబ్బందులు తాళలేక యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై తహసీనోద్దీన్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొండ గణేష్(32) కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. గణేష్‌కు భార్య ఇద్దరు పిల్లలున్నారు. వచ్చిన డబ్బులు సరిపోక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. మంగళవారం భార్యను పనికి పంపి గ్రామ శివారులో గణేష్ పురుగుల మందు తాగాడు. ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు తెలపడంతో లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందించేలోపే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాడు కళకళ...నేడు వెలవెల

(5వ పేజీ తరువాయి)

బొగ్గు నిల్వలు ఉండగానే యాజమాన్యం గనుల మూసివేత దిశగా అడుగులు వేస్తోంది. ఇదిలా ఉండగా మందమర్రి ప్రాంతంలో కొత్తగా కేకే 6 అండర్ గ్రౌండ్ మైన్, శ్రావణపల్లి ఓసీ గనులు వచ్చే అవకాశాలున్నా యాజమాన్యం, ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి వల్ల వాటి ఏర్పాటుకు మోక్షం లభించడం లేదు.

● ఆర్కే ఓసీ జీవితకాలం పెరిగేనా...?

ఇదిలా ఉండగా రామకృష్ణాపూర్ ఓసీపీ జీవితకాలం పెంచే అవకాశాన్ని యాజమాన్యం పరిగణలోకి తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ గని ఇప్పటికే మూసివేతకు గురికాగా, దీనిని ఆనుకొని ఫేజ్-2 ప్రాజెక్టు ప్రారంభానికి సింగరేణి సన్నాహాలు చేస్తోంది. తద్వారా గని జీవితకాలం పెంచేందుకు చర్యలు చేపడుతోంది. స్థానికంగా మూసివేతకు గురైన భూగర్భ గనులను కలుపుతూ ఆర్కే ఓసీ ఫేజ్-2 ఏర్పాటుకు సింగరేణి కసరత్తు చేస్తోంది. 18 ఏళ్ల జీవితకాలం దాదాపు 40 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలతో ఓసీపీ ఏర్పాటుకు అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే మూతపడిన ఆర్కే-4, ఆర్కే-3 భూగర్భ గనులతోపాటు ఆర్కే ఓసీపీని కలుపుకుంటూ ఫేజ్-2 నిర్మాణం జరుగనుంది. ఆర్కే కొత్త ఓసీపీ వస్తే రామకృష్ణాపూర్ పట్టణంలో మరో 20 ఏళ్లపాటు మనుగడ సాగించే వెసులుబాటు ఉంది. కొత్త ప్రాజెక్టుతో 500 మంది రెగ్యులర్ ఉద్యోగులు, మరో 600 మంది వరకు కాంట్రాక్ట్ కార్మికులకు జీవనోపాధి లభించనుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొత్త ఓసీపీకి పర్యావరణ, మైనింగ్‌శాఖల అనుమతులతో పాటు ఫారెస్ట్ క్లియరెన్స్ రావాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. అనుమతులు రాగానే ఆర్కే ఫేజ్-2 ఏర్పాటుకు లైన్ క్లియర్ కానుంది.

● షాఫ్ట్‌బ్లాక్ మైనింగ్‌తో మరింత మనుగడ..

సింగరేణి వ్యాప్తంగా ఓపెన్‌కాస్టు గనులలో ప్రస్తుతం 300 మీటర్ల లోనికి వెళ్లి బొగ్గును వెలికితీసే టెక్నాలజీ ఉంది. అయితే కొత్తగూడెంలో షాఫ్ట్ బ్లాక్ మైనింగ్‌తో 700 మీటర్ల వరకు లోనికి వెళ్లే వెసులుబాటు ఉంది. అదేమాదిరిగా ఇక్కడి ఓసీపీలను కూడా షాఫ్ట్ బ్లాక్ మైన్స్‌గా ఆధునీకరిస్తే మరో 300 నుంచి 400 మీటర్ల వరకు అదనపు తవ్వకాలు జరిపే అవకాశం ఏర్పడుతుంది. ఆర్కే ఓసీని షాఫ్ట్‌బ్లాక్ మైన్స్‌గా ఆధునీకరించాలనే అభిప్రాయాలు ఉన్నాయి. అలాగే ఇందారం, శ్రీరాంపూర్ ఓసీపీల సామర్థ్యం మరింతగా పెంచే అవకాశాలను యాజమాన్యం పరిగణలోకి తీసుకోవాలనే అభిప్రాయాలు ఉన్నాయి.

● కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టిసారించాలి....

జిల్లాలోని మూడు సింగరేణి ఏరియాలలో నాలుగు దశాబ్దాలపాటు ఉపయోగపడేలా బొగ్గు నిక్షేపాలు ఉన్నాయి. బొగ్గు ఉత్పత్తికి ఎలాంటి కొరతలేదు. కొత్తగా అండర్ గ్రౌండ్ మైన్లు ఏర్పాటు చేయడం ద్వారా ఉద్యోగ నియామకాలు చేపట్టి బొగ్గు తవ్వకాలు జరపాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

ఈ దిశగా సింగరేణి యాజమాన్యం కృషి చేయాల్సిన అవసరం ఉంది. అలాగే రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కూడా సింగరేణి ఏరియాలలో నూతన గనులను ప్రారంభించడం ద్వారా ఉద్యోగ అవకాశాలను పెంచేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


సంక్షిప్త సమాచారం

తాండూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : హైద్రాబాద్‌లో మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యశాల సమావేశంలో మండల నాయకులు పాల్గొన్నారు. బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఏముర్ల ప్రదీప్, మహిళ మోర్చా నాయకురాలు నల్లుల సంగీత, యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివకుమార్ పాల్గొన్నారు.

నెన్నెల : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో మహమ్మద్ అబ్దుల్ హై అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను, వంట సామగ్రిని పరిశీలించారు. సిబ్బంది, విద్యార్థుల సంఖ్య, సిలబస్ ఆదితర అంశాల గురించి ఎస్‌ఓ కవితను అడిగి తెలుసుకున్నారు.

జైపూర్ : మండలంలోని రసూల్‌పల్లి గ్రామంలోని శ్రీచైతన్య విద్యాలయంలో మంగళవారం శ్రీకాంత్ డెంటల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాలలో ఉన్న చిన్నారులకు దంత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీ పాల్గొన్నారు.

నస్పూర్: నస్పూర్ పట్టణం తీగల్ పహాడ్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం తెలంగాణ ఎరుకల ప్రజా సమితి ఆధ్వర్యంలో ఎరుకల చైతన్య సదస్సు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య, నాయకులు ఓదెలు, రజిత, కుమారస్వామి, సంతోష్, బక్కయ్య, రవికుమార్, సమ్మయ్య, జగన్నాదులు, సభాష్, ప్రభుదేవ్, అనిల్ పాల్గొన్నారు.



కేజీబీవీని సందర్శించిన జీఈసీవో

నస్పూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం జనరల్ ఇక్విటి కోఆర్డినేటర్ (జిఇసీఓ) విజయ లక్ష్మి సందర్శించారు. విద్యాలయంలో నిర్వహణ రికార్డులు, తరగతి గదులు, వంటశాల, వంట సామగ్రిని పరిశీలించారు. అందుతున్న సౌకర్యాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను అందించాలని సూచించారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చేపట్టాలన్నారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపల్ మౌనిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

● సైబర్ క్రైంపై అవగాహన..

నస్పూర్ కస్తూర్బా బాలికల విద్యార్థులకు మంగళవారం సీసీసీ నస్పూర్ ఏఎస్ఐ శకుంతల ఆధ్వర్యంలో మహిళ చట్టాలు, వివిధ అంశాలతో పాటు సైబర్ క్రైం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యాలయం ప్రిన్సిపల్ మౌనిక, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాలరీ అకౌంట్లను మార్చుకోండి

శ్రీరాంపూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులు తమ సాలరీ అకౌంట్లను ప్రమాద బీమా సౌకర్యం కలిగిన బ్యాంకుల్లోకి మార్చుకోవాలని ఇన్‌చార్జి డీజీఎం(పర్సనల్) రాజేశ్వర్ ఒక ప్రకటనలో కోరారు. ఏరియాకు చెందిన 218 మంది ఉద్యోగులు ఇతర బ్యాంకుల్లో ఖాతాలు కలిగి ఉన్నారని తెలిపారు. వారంతా ఎస్‌బీఐ, యూబీఐ, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లకు మార్చుకోవాలన్నారు. తద్వారా ఏవైనా ప్రమాదాలు జరిగితే బ్యాంకుల ద్వారా కుటుంబాలకు ప్రమాద బీమా సొమ్ము అందుతుందని పేర్కొన్నారు. వెంటనే తమ శాలరీ అకౌంట్లను ఆయా బ్యాంకుల్లోకి మార్చుకోవాలని సూచించారు.

నేటి నుంచి వాక్ ఇన్ అడ్మిషన్లు

శ్రీరాంపూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత విద్యాసంవత్సరంలో శ్రీరాంపూర్ ఐటీఐ, ఏటీసీలలో ప్రవేశానికి బుధవారం నుంచి వాక్ ఇన్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడతలో మిగిలిన సీట్లకు రెండవ విడతలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 28వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేసి ప్రవేశం కల్పిస్తామన్నారు.

దీక్షకు మద్దతుగా ట్రాన్స్‌జెండర్లు

జన్నారం, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): జన్నారం మండల అభివృద్ధికి అడ్డుగా ఉన్న అటవీ చట్టాలను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరహార దీక్ష మంగళవారం నాటి 21వ రోజుకు చేరింది. నేటికి 21వ రోజుకు చేరడంతో మంగళవారం మేము సైతం అంటూ మండల కేంద్రానికి చెందిన ట్రాన్స్‌జెండర్లు స్పందన, బుజ్జి దీక్షకు మద్ద తుగా దీక్షలో కూర్చున్నారు.



మందమర్రి ఏరియాలో కార్మికులు లేక ఖాళీగా ఉన్న సింగరేణి క్వార్టర్లు

నాడు కళకళ నేడు వెలవెల

క్రమేపీ తగ్గుముఖం..

ఒకప్పుడు లక్షా పై చిలుకు కార్మికులు పనిచేసిన సింగరేణి సంస్థలో కాలక్రమేణ కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పడుతోంది. సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాలలో ఇదే పరిస్థితి నెలకొనగా ప్రస్తుతం కార్మికుల సంఖ్య 40 వేలకు పడిపోయింది. గడిచిన ఐదేళ్ల కాలంలో ఎన్నడూ లేనివిధంగా కార్మికుల సంఖ్య వేగంగా తగ్గుముఖం పట్టగా, కొత్త నియామకాల పట్ల యాజమాన్యం ఊసెత్తకపోవడంతో సంస్థ మనుగడకు ప్రమాదం వాటిల్లే పరిస్థితులు నెలకొన్నాయి. సింగరేణికి సంబంధించి జిల్లాలోని శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఐదేళ్ల క్రితం మూడు ఏరియాలలో సుమారు 21వేల వరకు ఉన్న కార్మికుల సంఖ్య నేడు గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం మూడు ఏరియాలలో కలిపి 14 వేలపై చిలుకు మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు.

- బోసిపోతున్న సింగరేణి ఏరియాలు
- తగ్గుముఖం పడుతున్న కార్మికుల సంఖ్య
- గనులు మూతపడుతుండటంతో వలసబాట
- కొత్త గనుల ఏర్పాటుపై ఉదాసీన వైఖరి
- ప్రభుత్వం చర్యలు చేపట్టాలంటున్న కార్మికలోకం

మంచిర్యాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నాడు బొగ్గు గనులు, కార్మిక కుటుంబాలతో కళకళలాడిన సింగరేణి ప్రాంతం నేడు కార్మికులు లేక వెలవెలబోతున్నది. ఓ వైపు బొగ్గు గనులు మూత పడుతుండగా, మరో వైపు సింగరేణి యాజమాన్యం నూతన నియామకాలు చేపట్టకపోవడంతో కార్మికవాడలు పూర్తిగా బోసిపోతున్నాయి. గనుల మూతతో ఇంతకాలం ఇక్కడ పనిచేసిన కార్మికులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్తుండటంతో కొన్ని ఏరియాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

నియామకాలపై కానరాని శ్రద్ధ..

ఒకప్పుడు సింగరేణి ఉద్యోగం అంటేనే ప్రాణ భయంతో వణికేవారు. బొగ్గుబాయిలో ఉద్యోగం చేసేందుకు వెనుకంజ వేసేవారు. కాలక్రమంలో సింగరేణి సంస్థ ఉద్యోగ కల్పవల్లిగా రూపాంతరం చెందింది. బొగ్గు ఉత్పత్తి అవసరాల కోసం అప్పటి డైరెక్టర్ జీపీ రావు నేతృత్వంలో కార్మికుల సంఖ్య పెంచేందుకు కృషి చేశారు. 1985 ప్రాంతంలో రన్నింగ్ ద్వారా ఏక కాలంలో సుమారు 40వేల నియామకాలు చేపట్టారు. అలా సింగరేణిలో కార్మికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. కాలక్రమంలో బొగ్గు ఉత్పత్తి గణనీయంగా పెరిగనప్పటికీ కార్మికుల సంఖ్య మాత్రం క్రమేపీ తగ్గుతూ వస్తోంది. సంస్థలో కార్మికులు అవసరమైన దానికంటే అధికంగా ఉన్నారనే కారణంతో వివిధ పద్ధతుల్లో యాజమాన్యం వారి సంఖ్యను తగ్గించేందుకు శ్రీకారం చుట్టింది. గోల్డెన్ షేక్‌హ్యాండ్ పథకాన్ని తెరపైకి తేవడం ద్వారా సర్వీసు మిగిలి ఉండగానే కార్మికులను ముందస్తుగా ఉద్యోగాల్లో నుంచి తొలగించే ప్రక్రియకు నాంది పలికింది. అలా ప్రారంభమైన కార్మికుల ఏరివేత కారణంగా సింగరేణి వ్యాప్తంగా వారి సంఖ్య గణనీయంగా పడిపోయింది.

కొత్త గనుల ఏర్పాటు ఎప్పుడో...?

బొగ్గు ఉత్పత్తిపై సింగరేణి యాజమాన్యం చూపుతున్న శ్రద్ధ సంస్థ మనుగడపై చూపడం లేదన్న ఆరోపణలున్నాయి. ఓ వైపు అండర్ గ్రౌండ్ గనులను క్రమంగా మూసి వేస్తున్న యాజమాన్యం, వాటి స్థానంలో ఓపెన్‌కాస్టు గనులను తెరపైకి తెస్తోంది. జిల్లాలోని మూడు ఏరియాల్లో పెద్ద మొత్తంలో అండర్ గ్రౌండ్ గనులు ఇప్పటికే మూత పడగా, కొన్ని చోట్లా ఓసీల పరిస్థితి కూడా అలాగే ఉంది. ఇప్పటికే ఆర్కే-6 అండర్ గ్రౌండ్ మైన్ జూన్‌లో మూతపడగా, రామకృష్ణాపూర్ ఓపెన్‌కాస్టు గనిని కూడా మూసివేశారు. ఇక ఆర్కే-1, ఆర్కే న్యూటెక్, ఎస్ఆర్పీ-1, ఆర్కే-5 గనులు రాబోయే నాలుగైదేళ్ల కాలంలో మూతపడే అవకాశాలు ఉన్నాయి. ఇవి మూతపడితే వాటిలో పనిచేసే కార్మికులు ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లకతప్పని పరిస్థితి నెలకొంటుంది. ఈ కారణంగా ఇక్కడి సింగరేణి ఏరియాల్లో కార్మికుల సంఖ్య మరింతగా తగ్గే అవకాశాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో మరో 40 సంవత్సరాలకు సరిపడా..

మిగతా 7వ పేజీలో

సాదాసీదాగా సామాజిక తనిఖీ

నిరుపేదలకు పని దినాలు కల్పించడం లక్ష్యంగా పని చేయాలి: పీడీ కిషన్



వివరాలు అడిగుతున్న పీడీ కిషన్

జన్నారం, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన 15వ విడత సామాజిక తనిఖీ సాదాసీదాగా కొనసాగింది. ఈ కార్యక్రమానికి పీడీ కిషన్ హాజరయ్యారు. ఈసందర్భంగా 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 ఆర్థిక సంవత్సరం వరకు తనిఖీలు నిర్వహించి రికార్డులను స్వీకరించారు. 2025 ఆగస్టు 4 వరకు సామాజిక తనిఖీల్లో నిర్వహించిన పనులు 442 కాగా కూలీల వేతనాలు 7,29,98,148 రూపాయలు కాగా మెటీరియల్ పేమెంట్ 1,17,24629 రూపాయలు మొత్తం ఖర్చు 8,47,22,777 మొత్తం వేతనాలు 64976, పీఆర్ వర్క్స్ కింద సీసీ రోడ్డు నిర్మాణానికి 195 పనులకుగాను మెటీరియల్ పేమెంట్ 5,58,86,422 పనులు నిర్వహించగా ఇందులో సామాజిక తనిఖీల్లో 13వేల నిధుల అక్రమాలకు పాల్పడ్డారని వాటిని రికవరి కీ ఆదేశించారు. ఈ సందర్భంగా పీడీ కిషన్ మాట్లాడుతూ పేదలకు పని దినాలు కల్పించాలనే సదుద్దేశంతో ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టిందని దీని ద్వారా అభివృద్ధి పనులు చేపడుతూ ఉపాధి కల్పించడమే పని చేయాలన్నారు. రాష్ట్ర టెక్నికల్ మెంబర్ వేణు, ఎస్ఆర్పీలు రవి, సాయిలు, ఎంపీడీవో ఉమర షరీఫ్, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మందమర్రిటౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రాష్ట్రీయ రహదారిపై మంగళవారం లారీ ఢీకొన్న సంఘటనలో మహబూబాబద్ జిల్లా డోర్నకల్‌కు చెందిన కూనారపు వంశీ(32) అక్కడికక్కడే మృతిచెందాడు. వంశీ డోర్నకల్ నుంచి తన బైక్‌పై మందమర్రిలోని అత్తగారింటికి వస్తుండగా ఫ్లైఓవర్ వద్ద వాహనం ఆపడంతో లారీ ఢీకొని మృతిచెందాడు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ రాజశేఖర్ పరిశీలించారు. ఎస్ఐ మాట్లాడుతూ లారీని అజాగ్రత్తగా నడిపి ఢీకొట్టడంతోనే వంశీ మృతి చెందాడన్నారు. మృతుడికి భార్య, 5 నెలల కుమారుడు ఉన్నాడు. భార్యఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. భార్యను చూసేందుకు మందమ ర్రిలోని అత్తగారింటికి వస్తూ రోడ్డు ప్రమాదంలో వంశీ మృతి చెందడంతో కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపించారు. వంశీకి 5 నెలల క్రితం కుమారుడు జన్మించాడు. పది నిమిషాల్లో ఇంటికి చేరుతాడనుకునేలోగా మృతి చెందడంతో భార్య విలపిస్తున్న దృశ్యం అందర్ని కంటతడిపెట్టించింది.

జోడువాగు ఎన్‌హెచ్-63 రోడ్డు పనులను వేగవంతం చేయాలి

కేంద్ర మంత్రిని కలిసి విన్నవించిన రాష్ట్ర మంత్రి,ఎంపీ



కేంద్రమంత్రిని సన్మానిస్తున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి, ఎంపీ వంశీకృష్ణ

చెన్నూర్/మందమర్రిటౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని జోడువాగు రోడ్ ఎన్‌హెచ్ 63 రోడ్డు పనులను వేగవంతం చేయాలని కోరుతూ రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణలు కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరికి వినతి చేశారు. మంగళవారం ఢిల్లీలోని ఆయన నివాసంలో కలిసి రోడ్డు జాప్యానికి సంబంధించి వివరించారు. తెలంగాణ లోని ప్రధాన రహదారులకు సంబంధించి చొరవ చూపాలని వారు విన్నవించారు. ప్రధానంగా జోడు వాగు జాప్యం వల్ల రవాణా వ్యవస్థకు ఆటంకం కలుగుతుందన్నారు. గత సంవత్సర కాలంగా డీపీఆర్ దశలో ఉండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడడంతో పాటు అభివృద్ధిపై కూడా పడుతుందని వివరించారు. ఈ విషయాలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు మంత్రి, ఎంపీ పేర్కొన్నారు. అనంతరం కేంద్ర మంత్రిని మంత్రి, ఎంపీలు ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛాలు అందించారు.

గూడెంలో వైభవంగా పవిత్రోత్సవ పూజలు

దండేపల్లి ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పవిత్ర శ్రావణ మాసం పురస్కరించుకుని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో పవిత్రోత్సవ ప్రత్యేక పూజ కార్యక్రమాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజున ప్రత్యేక పూజా కార్యక్రమాలు యజ్ఞాచార్యులు అభిరామాచార్యులు, ఆలయ ముఖ్య అర్చకులు గోవర్ధన రఘస్వామి, వేదపండితులు దుద్దిళ్ల నారాయణ శర్మ, భరత్‌శర్మ, అర్చకులు సంపత్‌స్వామి, సురేష్‌స్వామి, రామకృష్ణస్వామిలచే ఘనంగా జరిపించారు. ముందుగా ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ యజ్ఞాచార్యులు, ఆలయ ముఖ్య అర్చకులకు నూతన వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు చంద్రశేఖర్, సత్యనారాయణ, సిబ్బంది తిరుపతి. అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

సహారా కార్యాలయం ఎదుట నిరసన

నస్పూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణం సీసీసీ కార్నర్ వద్ద గల సహారా ఇండియా కార్యాలయం ఎదుట బాధితులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు బాధితుల మాట్లాడుతూ సకాంలో తమ డిపాజిట్లను చెల్లించాలని డిమాండ్ చేశారు. తాము సింగరేణి కంపెనీలో నానా కష్ట పడి పైసపైసా కూడబెట్టి రిటైర్డ్ అయిన తర్వాత వచ్చిన సొమ్మును భవిష్యత్ అవసరాలకు సహారాలో డిపాజిట్ చేస్తే తమకు సకాలంలో చెల్లింపులు జరగడంలేదన్నారు. కాల పరిమితి దాటిన డిపాజిట్లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సహారా బాధితుల సంఘం నాయకులు వెంకటయ్య, దుర్గయ్య, శ్రీనివాస్, మోతె కాంతయ్య, రమాదేవి, డి. రావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించడం గర్వకారణం

జన్నారం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాల రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించడం గర్వంగా ఉందని డీఈవో యాదయ్య అన్నారు. సోమవారం మండలంలోని కిష్టాపూర్ పాఠశాలను సందర్శించారు. డిజిటల్ తరగులు బోధిస్తున్న విధానాన్ని పరిశీలించారు. అదే విధంగా పాఠశాలలో మొక్కలు నాటారు. పదిలో ఉత్తమ ఫలి తాలు సాధించి బాసర ట్రిబుల్ ఐటీలో ఏడుగురు విద్యార్థులు అర్హత సా ధించడం అభినందనీయమన్నారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండా రాజన్న, విద్యాశాఖ అధికారి విజయ్‌కుమార్, జిల్లా సెక్రెటిరియల్ అధికారులు చౌదరి, సత్యనారాయమూర్తి, పాఠశాల ఉపాధ్యాయులు దాముక కమలాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుల రక్తదానం

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీస్త్రికి అత్యవసరంగా రక్తం కావడంతో మన ఫౌండేషన్ సభ్యులు బాలకృష్ణ, రాజ్‌కుమార్, శేఖర్, తిరుపతితో పాటు పది మంది రక్తనిధి కేంద్రంలో మంగళవారం రక్తదానం చేశారు. రక్తనిధి కేంద్రం ఇన్‌చార్జ్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ మన ఫౌండేషన్ సభ్యులు రక్తదానం చేయడం గొప్ప విషయమన్నారు. అనంతరం వారికి ప్రశంసాపత్రాలు అందించారు.

'కాళేశ్వరం' పవర్ పాయింట్ ప్రజంటేషన్



పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వింటున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

నస్పూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ మంత్రి హరీష్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సందర్భంగా నస్పూర్ పట్టణంలోని బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం ఎల్ఈడీ స్ర్కీన్‌ను ఏర్పాటు చేసి జిల్లా నేతలు, కార్యకర్తలు వీక్షించారు. ఎండిన తెలంగాణ పొలాలకు కాలంతో సంబంధం లేకుండా సాగునీరు సరఫరా చేయాలనే లక్ష్యంతో అద్భుతంగా నిర్మాణం చేసినట్లు పెర్కొన్నారు. అతి పెద్ద పెత్తిపోతల పథకం కాళేశ్వరం ప్రాజెక్టును రికార్డు సమయంలో అత్యున్నత నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేశామని హరీష్ రావు ప్రజెంటెషన్‌లో వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, నస్పూర్ పట్టణ అధ్య క్షుడు అక్కురి సుబ్బయ్య, కేతిరెడ్డి వివిధ ప్రాంతాలకు చెందిన నేతలు రాజా రమేష్, కాంతయ్య, సరోజ, శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి, పల్లె భూమేష్, మధు, రామస్వామి పాల్గొన్నారు.

పంటలకు ఎంఎస్‌పీని పెంచిన ఘనత మోదీదే

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

లక్షెట్టిపేటలో రైతు సమ్మేళన సభ

లక్షెట్టిపేట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రైతుల పండించిన ఎన్నో పంటలకు ఎన్నో సార్లు ఎంఎస్‌పీని పెంచిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకే దక్కుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. లక్షెట్టిపేటలోని ఎస్‌పీఆర్ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన రైతు సమ్మేళన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల పక్షపాతి నరేంద్రమోదీ అన్నారు. రైతులకు పెట్టుబడి సాయం కింద కిసాన్ సమాన్ కింద నెలకు రూ.6వేలు క్రమం తప్పకుండా రైతుల ఖాతాల్లో ఎప్పటికప్పుడు జమ చేస్తోందన్నారు.

వ్యవసాయ సం క్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని తెలిపారు. మొదటిసారి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత రైతులకు మాయ మాటలు చెప్పి నట్టేట ముంచిందన్నారు. రైతుల ఆత్మహత్యలు బీఆర్ఎస్ పాలనలోనే పెరిగాయన్నారు. ఇక ఇప్పుడున్న కాంగ్రెస్ పార్టీ రైతులను అవసరానికి వినియోగించుకునేందుకు చూస్తుందని స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మొన్నటికి మొన్న రైతులకు రైతు బందు ఇచ్చిందన్నారు. ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి 15వేలు ఇస్తానని రైతుబంధు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. రైతులకు కేంద్రం నుంచి పూర్తిస్థాయిలో యూరియా వస్తుందని కానీ కేంద్రం పంపించడం లేదని ఆరోపించడం సరికాదన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో రైతులే బీఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీలకు బుద్ది చెప్పాలన్నారు. స్థానిక కరీంనగర్ చౌరస్తాలో గల శ్రీఛత్రపతి శివాజీ విగ్రహానికి పూల మాలలు వేసిన అనంతరం ఎండ్ల బండ్ల తో ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, ఎమ్మెల్సీలు మల్క కొమురయ్య, చిన్న మైల్ అంజిరెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాత్, మాజీ ఎంపీ వెంకటేశ్‌నేత, పార్టీ పట్టణ అధ్యక్షుడు వీరమల్ల హరిగోపాల్‌రావు, మండల అధ్యక్షుడు హేమంత్‌రెడ్డి, గోమాస శ్రీనివాస్ పాల్గొన్నారు,

బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పని చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్‌రావు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందని బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ప్రత్యామ్నాయంగా బీజేపీని ఎన్నికల్లో గెలిపించుకునేందుకు ఆసక్తితో ఉన్నారన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో దేశం పురోగమిస్తుందని దానికి పదకొండేళ్లలో 12లక్షల కోట్ల రూపాయలు వెచ్చించి జాతీయ రహదారులను, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే అన్నారు. జిల్లాలో స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలని తద్వారా రాష్ట్రంలో 2028 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్, ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, కొమురయ్య, మాజీ ఎంపీ వెంకటేశ్‌నేత, పట్టణ అధ్యక్షుడు అమిరిశెట్టి రాజుకుమార్ పాల్గొన్నారు.



రాష్ట్ర అధ్యక్షుడికి నాగలి అందజేస్తున్న రైతులు, నాయకులు

నేతకానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్

దండేపల్లి ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 15లక్షల పైబడి జనాభా కలిగి ఉన్న నేతకాని కులస్థులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్ డిమాండ్ చేశారు. మంగళవారం దండేపల్లిలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హా మీని నిలబెట్టుకుని నేతకాని సమాజానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే నామినేటెడ్ పదవుల్లో ప్రత్యేక స్థానం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సం ఘం రాష్ట్ర అధికార ప్రతినిధి గోళ్ల రాజమల్లు, ఉపాధ్యక్షుడు కామెర ప్రకాష్, కలలి నర్సయ్య, రాష్ట్ర యువజన అధ్యక్షుడు వనపర్తి యువరాజు, జిల్లా అధ్యక్షులు సునర్‌కారి రాంబాబు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట యుఎస్‌పీసీ ధర్నా

నస్పూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అదనపు కలెక్టర్ చంద్రయ్యకు అందించారు. జీవో నం. 25ను సవరించి ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులుండాలని, 40 విద్యార్థులకు ఇక టీచర్ ఉండాలని, ఉన్నత పాఠశాలల్లో జబ్జెక్ట్ వర్క్‌కు అనుగుణంగా టీచర్ పోస్టులు కేటాయించాలన్నారు. యుఎస్‌పీసీ జిల్లా అధ్యక్షుడు చక్రపాణి, రమేష్(డీటీఎఫ్), సంజీవ్(టీపీటీఎఫ్), జయకృష్ణ (డీటీఎఫ్), సీఆర్‌పీలు కేజీబీవి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

కలెక్టర్ కుమార్ దీపక్



భీమిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

భీమిని, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా కలెక్టరు కుమార్ దీపక్ సూచించారు. మంగళవారం భీమిని మండల కేంద్రంలోని ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామన్నారు. ఆసుపత్రిలో వార్డులు, మందుల నిలువలు, ల్యాబ్, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించి రోగులతో మాట్లాడారు. ఆరోగ్య కేంద్రంలో పొందుతున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు వ్యాపి చెందకుండా పాటించవలసిన జాగ్ర త్తలను ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కస్తూర్బా బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించారు.

అనంతరం మల్లీడి గ్రామంలో పాఠశాలకు వెళ్లి తరగతి గదులు, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మల్లీడి గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రామంలో నర్సరీని పరిశీలించి అక్కడి నర్సరీలో మొక్కల నిర్వహణ సక్రమంగా లేక పోవడంతో పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గంగామో హన్, ఎంఈవో కృష్ణమూర్తి, వైద్యులు అనిల్ కుమార్, సీహెచ్‌వో జలపతి, ఏపీవో సత్యప్రసాద్, హెచ్‌వీ ఇందిర, హెల్త్ అసి స్టెంట్ ఉమాశంకర్, ఆయా గ్రామాల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.